క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మతల్లికి బోనాలు



బోనాల ఊరేగింపు

మోమిన్‌పేట: మండలంలోని ఎన్కేపల్లి గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లికి భక్తులు ఘనంగా బోనాలు నిర్వహించారు. డప్పువాయిద్యాలతో ఆటలు ఆడుతూ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా బోనాలు తీసుకువెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నూతనంగా నిర్మించిన అమ్మవారి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన చేసి, బోనాలు నిర్వహించారు.

ముగిసిన ఆంజనేయస్వామి ఉత్సవాలు



దుద్యాల్ : మండలంలోని చిలుముల మైల్వార్ గ్రామంలోని అడవి ప్రాంతంలో వెలసిన మామిడికుంట ఆంజనేయస్వామి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తుల మొక్కుల చెల్లింపులో భాగంగా స్వామివారి పేరుపై చిన్న చిన్న కోడెలను(పశువులు) దేవాలయం దగ్గర వదిలారు. అలాగే, అక్కడ ఉన్న సీతారామచంద్రులకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. అడవి ప్రాంతంలో ఆంజనేయస్వామి కొలువుదీరడంతో ఈ ప్రదేశం అత్యంత పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు.

ప్రజాసేవలో సత్యసాయి భక్తులు



జాగ్రత్తలు వివరిస్తున్న కంటి వైద్యుడు

కొడంగల్ : కొడంగల్‌కు చెందిన సత్యసాయి భజన మండలి భక్తులు సేవా కార్యక్రమాలు నిర్వహించి, స్థానికుల మన్ననలు పొందుతున్నారు. ఆదివారం పట్టణంలో భజన మండలి భక్తుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రషీద్, డాక్టర్ అమిత్‌లు కంటి సమస్యలున్నా 85 మందిని పరీక్షించారు. అందులో 25 మందిలో కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ఆపరేషన్ కోసం శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. ఆపరేషన్ చేసిన తర్వాత మంగళవారం వారిని తిరిగి పంపిస్తామన్నారు. శిబిరం నిర్వహించిన సత్యసాయి భక్తులను పలువురు అభినందించారు.

అభివృద్ధికి నిధులివ్వండి



ఎమ్మెల్యేతో దామర్‌చెడ్ నాయకులు

బషీరాబాద్: గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలని దామర్‌చెడ్ గ్రామస్తులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి కోరారు. మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ నాయకుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, మురుగు కాల్వల నిర్మాణం, ఫార్మేషన్ రోడ్లకు నిధులు కేటాయించాలని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోవూరు నరేష్, సురేష్‌గౌడ్, జగదీశ్ తదితరులు ఉన్నారు.

రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచే ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక లక్ష్య బిల్వార్చన చేసి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేశారు.

మిషన్ భగీరథకు ఏమైంది?

రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాజీ సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని రూపొందించారు. కృష్ణా, గోదావరి నదుల నుంచి నీటి సేకరించి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా చేస్తోంది. సాఫీగా సాగిపోతున్న మిషన్ భగీరథ పథకంలో కొన్ని నెలలుగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో కొడంగల్‌లోని ఆయా గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది.

- మంచినీటి సరఫరాలో అంతరాయం
- గ్రామాల్లో గొంతు తడపని కృష్ణమ్మ
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కొడంగల్ మిషన్ భగీరథ ప్లాంట్

కొడంగల్ : మిషన్ భగీరథ విజయవంతమైన నీటి సరఫరా పథకం. చుక్కనీరు అందని గ్రామాలకు సైతం మిషన్ భగీరథలో భాగంగా కృష్ణమ్మ వెళ్లి దాహార్తి తీర్చింది. కాని కొన్ని నెలలుగా మిషన్ భగీరథకు ఏమైందో తెలియదు.. నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా మంచినీటికి కరువొచ్చింది. కొన్ని రోజులుగా నీటి సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఎప్పుడు నీటిని వదులుతారో తెలియని పరిస్థితి నెలకొంది. మిషన్ భగీరథలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని.. నీటి సరఫరాలో అంతరాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

అసలు ఏం జరుగుతోంది..

ప్రజల్లో మిషన్ భగీరథపై అపోహ ఏర్పడింది. అసలు మిషన్ భగీరథకు ఏమైందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వర్షాలు లేనప్పుడు ఎండాకాలంలో కూడా మిషన్ భగీరథ నీటి సరఫరా ఆగలేదు. ఇప్పుడు వానాకాలం అంతా సవ్యంగా ఉన్నప్పుడు నీటి సరఫరా ఎందుకు ఆగిందని ఆయా గ్రామాల మహిళలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం మిషన్ భగీరథకు శాపంగా మారిందనే ఆరోపణలు వస్తున్నాయి. మిషన్ భగీరథలో సాంకేతిక సమస్యలు ఉన్నందున నీరు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఏనాడు ఇబ్బందులు రాలేదు. ఇంటింటికి మంచినీటిని అందించారు. అయితే, కొంత కాలంగా మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పథకం పరిస్థితి దయనీయంగా మారిందనే అపవాదు ఉంది. శ్రీశైలం నుంచి వచ్చే నీటి సామర్థ్యం తగ్గింది. కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసే సమయాన్ని కూడా కుదించారు.

తాగునీటికి అవస్థలు పడుతున్నాం..

బొంరాస్‌పేట: గ్రామాలకు తాగునీరందించే భగీరథ నీటి సరఫరాలో తరచుగా అంతరాయం ఏర్పడటంతో మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇటీవల భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో మండలంలోని నాగిరెడ్డిపల్లి, తుంకిమెట్ల, ఎన్కేపల్లి, రేగడిమైలారం తదితర గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఊరి బయట ఉన్న బోరు, సింగిల్ ఫేస్ మోటార్ల వద్ద నుంచి, వ్యవసాయ మోటార్ల నుంచి తీసుకెళ్తున్నామని వాపోయారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని కోరుతున్నారు.



నీళ్ల కోసం ఊరిబయట ఉన్న బోరు వద్ద రేగడిమైలారం గ్రామస్తులు

యువత క్రీడల్లో రాణించాలి

ఏఎస్ఐ సత్యనారాయణ

బంట్వారం: గ్రామీణ యువత క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో ఆడాలని కోట్‌పల్లి ఏఎస్ఐ సత్యనారాయణ అన్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుని ఆదివారం నాగసాన్‌పల్లిలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ. క్రీడలతో శారీక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోను ఆసక్తి పెంచుకోవాలన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాకారులకు ఉద్యోగ నియామకాల్లో కూడా ప్రాధాన్యం ఉంటుందన్నారు. అంతకు ముందు ఆయన క్రీడాకారులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ,గ్రామస్తులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న సత్యనారాయణ

విద్యుత్ సమస్యలకు పరిష్కారం

ధారూరు: మండల కేంద్రంలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా సిబ్బంది ఆదివారం పనులు చేపట్టింది. ఇందులో భాగంగా ధారూరు అంబేడ్కర్ చౌరస్తా నుంచి గ్రామంలోకి ఉన్న 11 కేవీ ఫీడర్ లైన్‌లో ఓ లైన్‌ను తొలగించి కొత్తలైన్‌కు కలిపారు. విద్యుత్‌తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. పాతకాలం నాటి విద్యుత్ తీగలు, స్తంభాలను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు శ్రమిస్తున్నారు. మండలంలో నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా కొనసాగేలా చేయడానికి పనులు చేయిస్తున్నామని ట్రాన్స్‌కో మండల ఏఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో విద్యుత్ మరమ్మతులు పూర్తయితే సమస్యలు తొలగిపోతాయని కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, కిరణ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.



పాత విద్యుత్ తీగలను తొలగిస్తున్న సిబ్బంది

నేటి నుంచి యోగా శిక్షణా శిబిరం

కొడంగల్ : నేటి నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు యోగా శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ తెలిపారు. పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ప్రతి రోజు ఉ. 5.30 గంటల నుంచి ఉ. 7 గంటల వరకు యోగా ఉంటుందన్నారు. యోగా గురువు అనిలేష్ ఆచార్య నేర్పిస్తారని వివరించారు. మహర్షి యోగానందగారి ఆశీస్సులతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 11 రోజుల పాటు జరిగే యోగా తరగతులకు ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు రమేష్‌బాబు ఎంపిక



ప్రశంసాపత్రం అందజేస్తున్న నల్లరాధాకృష్ణ

దోమ : డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎన్.రమేశ్‌బాబు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిర్వహించిన సదస్సు లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లరాధాకృష్ణ రమేశ్‌బాబును జాతీయ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ మేరకు ఆ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ అవార్డును సెప్టెంబర్ 5వ తేదీన ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా కేంద్రంలో నిర్వహించే 8వ సౌత్‌ఇండియన్స్ కాన్ఫిరెన్స్‌లో అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు టెంకాయలు, పార్కింగ్ వేలం

పెద్దేముల్: పెద్దేముల్ మండల తట్టిపల్లి గ్రామ శివారులోని అంబురామేశ్వర దేవాలయం వద్ద నేడు (సోమవారం) టెంకాయలు, పార్కింగ్ వేలం వేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వుడాల వెంకటేశం , కార్యవర్గ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు జరగనుందని తెలి పారు. వేలంలో పాల్గొనే భక్తులు రూ.1000 అడ్వాన్స్ చెల్లించి పాల్గొనాలని కమిటీ సభ్యులు వెల్లడించారు. వేలం దక్కించుకున్న వారు అడ్వాన్స్ చెల్లించాల్సి ఉందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మున్సిపల్ ఛైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని మున్సిపల్ ఛైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీడలు రెండు ప్రాంతాల మధ్య సత్సంబంధాలను నెలకొల్పుతాయన్నారు. నిత్యం క్రీడలు ఆడటం వల్ల ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ భాస్కర్, క్రీడాకారులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, రఘు పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ అశోక్

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

కుల్కచర్ల : మండల పరిధిలోని దాస్యనాయక్ తండాకు చెందిన పాల్యా చందర్ ముజాహిద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-2005వ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేశాడు. ఈ క్రమంలో అతని తండ్రి గోవింద్‌నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు, బాధిత స్నేహితుడి కుటుంబానికి రూ. 25వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్నేహితులంటే అన్ని సందర్భాల్లో తోడు, నీడగా నిలిచే వ్యక్తులమన్నారు. వారికి ఎలాంటి కష్టాలు వచ్చిన అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గోవిందు, తులసి, అభిజిత్‌నాయక్, రామ్, బాల్‌సింగ్, యాదయ్య, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల నూతన కమిటీ ఏర్పాటు

దుద్యాల్ : మండలంలోని హస్నాబాద్ గ్రామంలో వినాయక ఉత్సవాల నూతన కమిటీని గ్రామస్తులు ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ పక్కిరప్ప, లక్ష్మారెడ్డి, అధ్యక్షుడిగా ఆర్.నర్సన్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా రాములు, కార్యదర్శిగా నర్సోజీ, ఉప కార్యదర్శిగా కొడంగంటి భీములు, కోశాధికారిగా కె. నర్సన్‌గౌడ్, సహాయ కోశాధికారిగా నాయికోటి నర్సింలు, సాంస్కృతిగా కార్యదర్శిగా కొడంగంటి నరేశ్, మహేశ్‌గౌడ్, భజన మండలి కమిటీ సభ్యుడిగా దుద్యాల అంజిలయ్య, బండారి నర్సింలు, తుంకిమెట్ల రాజు, ఉప్పరి యాదయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్తులందరు కలిసికట్టుగా వినాయక ఉత్సవాలు నిర్వహించాలని, ఎవరికి ఇబ్బందులు కల్గకుండా చూడాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం

కుల్కచర్ల: గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ వెంకటమ్మ చిన్నయ్య అన్నారు. ఆదివారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల తరువాత కార్యదర్శులే కీలకమన్నారు. తిర్మలాపూర్ గ్రామపంచాయతీ గ్రామాభివృద్ధికి కార్యదర్శి శ్రీనివాస్ ఎంతో కృషి చేశారని అన్నారు.

ఇరిగేషన్ ఏఈఈ నరేష్‌కు సన్మానం

టీఎస్‌పీఎస్సీలో ఇరిగేషన్ ఏఈఈగా ఎంపికైన నరేష్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. నిరుపేద కుటుంబం నుంచి గెజిటెడ్ పోస్ట్ స్థాయికి ఎంపిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, నర్సింలు, బంధయ్య, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శి శ్రీనివాస్, ఏఈఈ నరేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి

కొడంగల్: ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంఘం నాయకులు మన్నె బస్వరాజ్, వెంకటయ్య, అరిగె ఓం ప్రకాశ్ డిమాండ్ చేశారు. ఓబీసీ హక్కుల కోసం పోరాడిన బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతిని ఆదివారం పట్టణంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో అధికంగా ఉన్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు బీసీలకు అందడం లేదని ఆరోపించారు. బీపీ మండల్ దేశంలో ఓబీసీల హక్కుల కోసం ఉద్యమించినట్లు తెలిపారు. ప్రభుత్వాలు స్పందించి బీసీ గణన చేయాలన్నారు. కులాల ప్రతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు చంద్రశేఖర్ గౌడ్, పకీరయ్య, నరసయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

అల్లుకున్న ప్రమాదం



ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పిచ్చి మొక్కలతో నిండిన ట్రాన్స్‌ఫార్మర్



కాళికాదేవి ఆలయం పక్కన..

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లే మార్గం, కాళికాదేవి దేవాలయం సమీపంలో ఉన్న విద్యుత్ బుడ్డిల చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకొని ప్రమాద భరితంగా ఉన్నాయి. విద్యుత్ బుడ్డిలకు పచ్చని తీగలు అల్లుకొని ఉండటంతో వాటి నుంచి విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అసలే వర్షాకాలం ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే తీగలను తొలగించాలని కోరుతున్నారు.

ఆలయ నూతన కమిటీ నియామకం

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం ఆదర్శనగర్‌లోని మాత కట్టమైసమ్మ ఆలయ నూతన కమిటీ నియామక ప్రక్రియ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ గౌరవాధ్యక్షుడిగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్, అధ్యక్షుడిగా బి నరేష్, ఉపాధ్యక్షుడిగా నవీన్‌కంఠం, ప్రధాన కార్యదర్శిగా కె వేణుగోపాల్, సహాయ కార్యదర్శిగా కె నర్సింలు, కోశాధికారిగా అంజిలయ్య, రాములు, కార్యవర్గ సభ్యులుగా ఎస్ సుధాకర్, పట్నం రమేష్, జె సుధాకర్, కృష్ణ, రాజేష్, వెంకటప్ప, బెజ్జు రమేష్, పాపయ్య, ఆనంద్, యాదగిరిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



మాత కట్టమైసమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు

శివాజీ స్ఫూర్తితో ముందుకు..

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎంపీ కొండా

మోమిన్‌పేట: ఛత్రపతి శివాజీ దేశభక్తిని ప్రతి ఒక్కరూ అనుకరించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మేకవనంపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ చూపిన ధైర్యసహాసాలు అసామాన్యమైనవని అన్నారు. ఆయన చూపిన తెగువ, రాజనీతిని ప్రతి ఒక్కరూ దేశం కోసం చూపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటరు వడ్ల నందు, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భుజంగారెడ్డి, నాయకులు రాంచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పెసరకు కలిసొచ్చిన కాలం

- క్వింటా ధర రూ. 6,705
- తాండూరు మార్కెట్‌లో 6,385 క్వింటాళ్ల కొనుగోలు
- గతేడాది కంటే తగ్గిన ధర

తాండూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పెసర, మినుము పంటలకు వాతావరణం అనుకూలించడంతో రైతులు ఆశాజనకంగా ఉన్నారు. వర్షాకాల సీజన్‌లో ఒక నెలలో వర్షం కురిస్తే మరుసటి నెలలో వర్షాలు పడలేదు. దీంతో స్వల్పకాలిక పంటలైన పెసర, మినుము, సోయ లాంటి పంటలకు కలిసొచ్చింది. పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవకపోవడంతో పంటలకు ఎలాంటి నష్టం జరగదు. దీంతో ఈ సీజన్‌లో మార్కెట్‌కు పంట ఉత్పత్తులు అధికంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. గతేడాది పెసర ఉత్పత్తులకు పలికిన ధర కంటే ఈ సారి ధరలు పడిపోవడం గమనార్హం.



తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ

తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గత రెండు మూడేళ్లుగా పెసర, మినుము పంటల ఉత్పత్తుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ ఉత్పత్తులు తగ్గిపోయాయి. కాని, ఈ సారి వారం రోజుల వ్యవధిలో తాండూరు వ్యవసాయ మార్కెట్‌కు 6,385 క్వింటాళ్ల పెసర ఉత్పత్తుల కొనుగోళ్లు జరగడం అందుకు నిదర్శనం. గతంలో సీజన్ మొత్తం పెసర పంట ఉత్పత్తులు కేవలం 5వేల క్వింటాళ్ల వరకే పరిమితమయ్యాయి. ఈ సీజన్‌లో మార్కెట్‌కు ఉత్పత్తులు అధికంగా తరలివస్తున్నాయి. మార్కెట్ యార్డులో పెసర క్వింటాలుకు గరిష్ఠ ధర రూ.7,355, కనిష్ఠ ధర రూ.5,857 సగటు ధర రూ.6,705 చొప్పున ధరలు పలుకుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 6,385 క్వింటాళ్ల పెసర పంట కొనుగోళ్లు జరిగాయి. గతేడాదితో పోల్చితే ఈ సారి కొనుగోళ్లు పెరిగే అవకాశాలున్నాయి.

పెరిగిన దిగుబడి ..తగ్గిన ధరలు..

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పెసర పంట దిగుబడులు పెరిగాయి. అయితే, మార్కెట్‌లో మద్దతు ధర కంటే తక్కువగానే ధరలు పలుకుతున్నాయి. గతేడాది మార్కెట్ యార్డులో పెసర క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 10,100, కనిష్ఠ ధర రూ.7,551, సగటు ధర రూ.8,905 చొప్పున ధరలు పలికాయి. ఈ సీజన్‌లో మార్కెట్‌లో పెసర పంట ఉత్పత్తికి ధరలు గణనీయంగా పడిపోయాయి. గతేడాదితో పోల్చితే ఈ సారి క్వింటాలుకు రూ.2వేల నుంచి 3 వేల వరకు తగ్గింది.